



కరువుపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కేంద్ర కరువు బృందం అధికారులు

డిఎస్‌సిపై ఆశలు

AP DSC

- జిల్లాలో లక్ష మంది అభ్యర్థులు
- పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఐదేళ్లుగా డిఎస్‌సి నిర్వహించకపోవడంతో బిఎడ్‌, డిఎడ్‌ చేసిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ ప్రభుత్వం విడుదల చేయనున్న డిఎస్‌సిపై ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా లక్ష మంది వరకూ డిఎస్‌సిపై అర్హులైన అభ్యర్థులు ఉన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టనున్న డిఎస్‌సిలో పోస్టుల సంఖ్య పెంచాలని పలువురు డిమాండ్‌ చేస్తున్నారు..

ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు తీసుకున్న సమయంలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం తొలి సంతకం చేశారు. దీంతో ఆ ఖాళీలను భర్తీ చేసేందుకు విద్యా శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఐదేళ్లుగా డిఎస్సీ నిర్వహించకపోవడంతో బిఎడ్‌, డిఎడ్‌ చేసిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ ప్రభుత్వం విడుదల చేయనున్న డిఎస్సీపై ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా లక్ష మంది వరకూ డిఎస్సీకి అర్హులైన అభ్యర్థులు ఉన్నారు. వైసిపి ప్రభుత్వం ఈ ఏడాది ఆరంభంలో వదిలిన డిఎస్సీలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు 1,543 పోస్టులు కేటాయించారు. ఎస్‌జిటి తెలుగు మీడియం 958 పోస్టులు, ఎస్‌జిటి కన్నడ మీడియం 21 పోస్టులు, ఎస్‌జిటి ఉర్దూ మీడియం 17 పోస్టులు, మున్సిపల్‌ పాఠశాలల్లో 21 పోస్టులు, స్కూల్‌ అసిస్టెంట్‌(ఎస్‌ఎ) బయాలజీ కన్నడ మీడియం 12 పోస్టులు, ఎస్‌ఎ బయాలజీ తెలుగు మీడియం 23 పోస్టులు, ఎస్‌ఎ ఇంగ్లీష్‌ 41 పోస్టులు, ఎస్‌ఎ హిందీ 110 పోస్టులు, ఎస్‌ఎ గణితం(కన్నడ) 16 పోస్టులు, ఎస్‌ఎ గణితం (తెలుగు) 51, ఎస్‌ఎ గణితం (ఉర్దూ) 8, ఎస్‌ఎ వ్యాయామ విద్య 82 పోస్టులు, ఎస్‌ఎ సాంఘిక శాస్త్రం 28, ఎస్‌ఎ తెలుగు 65 పోస్టులు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వం విడుదల చేయనున్న మెగా డిఎస్‌సిలో ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రామాణికంగా ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. ఈ డిఎస్‌సిలో ఉమ్మడి జిల్లాకు 2300 నుంచి 2500 ఉపాధ్యాయ పోస్టులు వచ్చే అవకాశం ఉందని అంచనా. వైసిపి ప్రభుత్వం ఇచ్చిన డిఎస్సీకి ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎస్‌జిటి పోస్టులకు 19వేల మంది, స్కూల్‌ అసిస్టెంట్‌ పోస్టులకు పదివేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

మొత్తం ఉమ్మడి జిల్లాలో డిఎడ్‌, బిఎడ్‌ అయిపోయి ఉపాధ్యాయ పోస్టులకు అర్హులుగా అభ్యర్థులు ఉండే లక్ష మంది ఉన్నారు. కానీ పోస్టులు, పరీక్షపై ఉన్న గందరగోళం, డిఎస్‌సి జరుగుతాదో లేదో అనే అనుమానంతో తక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 39 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, టిడిపి ప్రభుత్వం చేపట్టే డిఎస్‌సి ద్వారా కనీసం 25వేల పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగులు, యువజన సంఘాల నాయకులు డిమాండ్‌ చేస్తున్నారు. ప్రత్యేక ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.

25వేల పోస్టులను భర్తీ చేయాలి



గతంలో పార్ల మెంటులో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రకటించిన వివరాల ప్రకారం రాష్ట్రంలో 39,008 ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిఒ 117 రద్దు చేస్తే మొత్తం 50వేల ఉపాధ్యాయ పోస్టులు అవసరం అవుతుంది. కాబట్టి తక్షణమే పాఠశాలల విలీనానికి సంబంధించిన జీవో నెంబర్‌ 117ను రద్దు చేయాలి. అప్రెంటిస్‌ విధానాన్ని రద్దు చేయాలి. మొదట దఫా డిఎస్‌సిలో 25 వేల పోస్టులను భర్తీ చేయాలి. ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 సంవత్సరాలకు తగ్గించాలి. ఇతర శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలన్నింటికీ నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ చేయాలి. మధ్యలోనే ఆగిపోయిన కానిస్టేబుల్‌ ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం చర్యలు తీసుకొని హోం శాఖలో ఖాళీగా ఉన్న 24 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలి. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చే వరకు నిరుద్యోగ భృతి నెలకు రూ.8వేలు చెల్లించాలి.-

-వై.నగేష్‌, డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి

వచ్చారు..వెళ్లారు..

- మొక్కుబడిగా కరువు బృందం పర్యటన

ప్రజాశక్తి - ఆలూరు, కర్నూలు కలెక్టరేట్‌

కర్నూలు జిల్లాలోని ఆలూరు, కోడుమూరు మండలాల్లో కరువు బృందం సభ్యులు డిపార్ట్మెంట్‌ ఆఫ్‌ ఎక్స్పెండేచర్‌ డైరెక్టర్‌ చిన్మయ పుండ్లిక్‌ రావు గాట్మేర్‌, తాగు నీరు, పారిశుధ్యశాఖ డిప్యూటీ అడ్వైజర్‌ ఆషిస్‌ పాండే, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ అరవింద కుమార్‌ సోని బుధవారం పర్యటించారు. వారి పర్యటన మొక్కుబడిగా సాగింది. కార్యాలయాల్లో ఫొటో ఎగ్జిబిషన్లను తిలకించడం, రైతులు చెప్పింది వినడం వరకే పరిమితం అయ్యారు. ఆలూరు, కోడుమూరులో రబీకి సంబంధించి దెబ్బతిన్న శనగ, జొన్న తదితర పంటలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ తిలకించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కరువు పరిస్థితిని జెడి పిఎల్‌ వరలక్ష్మి వివరించారు. ఆలూరు ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవడానికి పెండింగ్‌లో ఉన్న వేదవతి, నగరడోన ప్రాజెక్టు లను పూర్తి చేయాలని రైతులు అధికారులను కోరారు. ఈ ప్రాంత రైతులు వర్షాధారంపై ఆధారపడి జీవిస్తారని, అధికంగా వలసలు వెళ్లి బతకాల్సిన పరిస్థితి ఎక్కువగా ఉంటుందని కేంద్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతులు మాట్లాడుతూ అధికారికంగా ఖరీఫ్‌లో హెక్టార్‌కు రూ.17వేలు, రబీలో హెక్టార్‌కు రూ.10వేలు ఇస్తుండగా పెట్టిన పెట్టుబడులు విత్తనాలు, మందులకు ఏ మాత్రం సరిపోవని, ఖరీఫ్‌లో హెక్టారుకు రూ.35 వేలు, రబీలో హెక్టారుకు రూ.25 వేలు ఇవ్వాలని కోరారు. కరువు బృందం సభ్యులు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా కరువు మండలాలకు 1లక్ష 30వేల29 హెక్టార్లకు రూ.129 కోట్ల అంచనాతో ప్రభుత్వ అధికారులు కేంద్రాన్ని అడగగా రూ.96 కోట్లు నష్టపరిహారం ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు, రైతు సంఘం నాయకులు తెలిపినవి విషయాల నివేదికను కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఒ హిమ ప్రభాకర్‌ రాజు, డ్వామా పిడి అమర్నాథ్‌ రెడ్డి, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ఆలూరు ఎడిఎ సునీత, తహశీల్దార్‌ చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న డిఎంహెచ్‌ఒ డాక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌, వైద్యులు, ఇతర సిబ్బంది

సికిల్‌ సెల్‌ అనీమియాపై అవగాహన పెంచుకోవాలి

- డిఎంహెచ్‌ఓ డాక్టర్‌ వై ప్రవీణ్‌ కుమార్‌

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్‌

ప్రపంచ సికిల్‌ సెల్‌ అనీమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని డిఎంహెచ్వో కార్యాలయంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్‌ వై ప్రవీణ్‌ కుమార్‌ గోడ పత్రికను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్‌ 19 వ తేదీన "ప్రపంచ సికిల్‌ సెల్‌ అనీమియా అవగాహన దినోత్సవం నిర్వహిస్తారు అని తెలిపారు. 2047 నాటికి సికిల్‌ సెల్‌ అనీమియాను నిర్మూలించాలనే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించట అవగాహన కల్పించబడునని తెలిపారు. సికిల్‌ సెల్‌ అనీమియా అనేది అంటువ్యాధి కాదని వంశపారంపర్యంగా మాత్రమే వ్యాపిస్తుంది అన్నారు. ఇది ఎర్ర రక్త కణాల నిర్మాణంపై ప్రభావం చూపుతుందని, శరీరం అంతటా ఆక్సిజన్‌ను రవాణా చేస్తుంది అన్నారు. ఎర్ర రక్త కణాలు సాధారణంగా గోళాకారంగా ఉండి రక్తనాళాల గుండా సులభంగా వెళ్లేలా చేస్తాయి. సికిల్‌ సెల్‌ అనీమియాలో కొన్ని ఎర్ర రక్త కణాలు సికిల్స్‌ లేదా చంద్రవంక ఆకారంలో ఉంటాయి. ఇది గట్టిగా మరియు జిగటగా మారుతుంది అన్నారు రక్త ప్రవాహాన్ని నెమ్మదిస్తుంది లేదా అడ్డుకుంటుందనీ తెలిపారు. దీనిపై సిహెచ్‌ఓలు, ఎఎన్‌ఎంలు ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాదికారి ఆదేశించారు. కార్యక్రమంలో పిఓఆర్‌బిఎస్‌ కే హేమలత, డిపిఎంఓ డాక్టర్‌ సంధ్యా, ఎస్‌ఓ హేమసుందరం, డిపిహెచ్‌ఎన్‌ఓ ఇందిరా పాల్గొన్నారు.

సస్పెన్షన్‌ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి : ఫ్యాప్టో

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్‌

సార్వత్రిక ఎన్నికల్లో సస్పెన్షన్‌కు గురి అయిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల సస్పెన్షన్‌ ఉత్తర్వులను సత్వరమే ఉపసం హరించు కోవాలని ఆంధ్రప్రదేశ్‌ ఉపాధ్యాయ సంఘాల సమైక్య (ఫ్యాప్టో) జిల్లా చైర్మన్‌ యస్‌.గోకారి, సెక్రటరీ జనరల్‌ జి.తిమ్మప్ప, సభ్యులు డిమాండ్‌ చేశారు. బుధవారం డిఆర్‌ఓ కె.మధుసూదన్‌ రావుకు ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్వరమే ఉత్తర్వులను ఉపసంహరించుకుని, విధులలో చేరే విధంగా అదేశాలివ్వాలన్నారు. డిఆర్‌ఓ స్పందిస్తూ జిల్లా కలెక్టర్‌ దృష్టికి తీసుకువెళ్లి వెంటనే తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్‌ నుండి మహమ్మద్‌ రఫీక్‌, యస్‌టియు నుండి టి.కే.జనార్ధన్‌, ఏపిటిఎఫ్‌ 257 నుండి యం.రంగన్న, ఏపిటిఎఫ్‌ 1938 నుండి ఐ.మారియానందం, ఆప్టా నుండి సేవాళాల్‌ నాయక్‌, బిటిఏ నుండి భాస్కర్‌, ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు



కరువు బృందానికి వినతిపత్రం ఇస్తున్న ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, తదితరులు

ఎకరాకు రూ.10వేలు నష్టపరిహారం ఇవ్వాలి

- కరువు బృందానికి ఎపి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-ఆలూరు

రబీలో రైతులు నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ.10వేలు నష్టపరిహారం ఇవ్వాలని ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్‌ చేశారు. ఆలూరులో రైతు సంఘం నాయకులు కరువు బృందానికి వినతిపత్రం సమర్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో గత ఏడాది 1,96,759 హెక్టార్లలో రబీలో వేసిన పంటలకు సకాలంలో వర్షాలు పడక పూర్తిగా పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయరన్నారు. జిల్లాలోని 26 మండలాలకు గాను 24 మాత్రమే కరువు మండలాలు అని జిల్లా అధికారులు తెలపడం అన్యాయమన్నారు. తుగ్గలి, కర్నూలు మండలాలకు ఖరీఫ్‌ నష్టపరిహారం ఇవ్వకపోగా రబీలోనైన కరువు మండలాలుగా ప్రకటించి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కరువు పీడిత ప్రాంతాల్లో రైతులు బ్యాంకులో తీసుకున్న రుణాలను రద్దు చేయాలని, బ్యాంకులో క్రాప్‌ ఇన్స్యూరెన్స్‌ పరిహారం అందించాలన్నారు. ఈ ఏడాదిలో 90శాతం సబ్సిడీతో రైతులకు విత్తనాలు అందించాలని, నకిలీ పత్తి విత్తనాలపై ఉక్కుపాదం మోపి పూర్తిగా అరికట్టాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఏపి రైతు సంఘం జిల్లా నాయకులు పి.హనుమంతు, ఈరన్న, సూరి, సిద్దయ్య గౌడ్‌, ధనుంజయ, పరమేష్‌, సిఐటియు నాయకులు కెపి.నారాయణస్వామి, షాకీర్‌, క్రిష్ణ, విఠల్‌ పాల్గొన్నారు.



గుంతలు పడిన రోడ్లను పరిశీస్తున్న సిపిఎం నగర నాయకులు రాముడు, రాజశేఖర్‌

కొత్త రోడ్లను నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్‌

కర్నూలు నగరంలో ప్రధాన రహదారులు, అభివబిద్ధి చెందుతున్న కాలనీలలో రోడ్ల పరిస్థితి చాలా అధ్వానంగా ఉందని సిపిఎం పార్టీ కర్నూలు న్యూ సిటీ కార్యదర్శి టి రాముడు అన్నారు. సిపిఎం పార్టీ కర్నూలు నగర కార్యదర్శులు టి.రాముడు, ఎం.రాజశేఖర్‌, కే.ప్రభాకర్‌, ఎస్‌ హుస్సేన్‌ వలి, అబ్దుల్లా, బతుకన్న, ఐద్వా నాయకురాలు కుమారి, పర్వీన్‌లతో కలిసి కొత్త బస్టాండ్‌ సమీపంలో ఉన్న సుందరయ్య సర్కిల్‌, గాయత్రి హాస్పిటల్‌, ఆధ్యా సూపర్‌ స్పెషాలిటీ హాస్పిటల్‌లకు వెళ్లే రోడ్డు పెద్ద పెద్ద గుంతలు పోవడంతో ప్రయాణికులు, పేషెంట్లు పడుతున్న బాధలను పరిశీలించారు. సిపిఎం నగర కార్యదర్శులు టి.రాముడు, ఎం.రాజశేఖర్‌ మాట్లాడుతూ గత ప్రభుత్వ ఐదు సంవత్సరాల కాలంలో రోడ్లు గుంతలు పడి అనేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. కర్నూల్‌ నగరంలో ప్రధాన రహదారులతో పాటుగా కర్నూల్‌ చుట్టుపక్కల ఉన్న కల్లూరు కాలనీలు కార్పొరేషన్‌ లో విలీనమైన స్టాంటన్‌ పురం, పందిపాడు, లక్ష్మీపురం, పెద్దపాడు ప్రాంతాలలో రోడ్ల పరిస్థితి చాలా అధ్వానంగా ఉందని అన్నారు. చిన్న వర్షం వస్తే చాలు నగరంలో అనేక ప్రాంతాలలో జలమాయమైపోతున్నాయని, డ్రైనేజీ వ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా ఉందని, మురికి నీరు ప్రధాన రోడ్లపై ప్రవహిస్తున్న పట్టించుకునే నాధుడే కరవయ్యాడని తెలిపారు. అందుకే ఎన్నికల్లో ప్రజలు గత ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పారని అన్నారు. కొత్తగా ఏర్పడిన టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ కాలువల అబివృద్ధి కోసం దృష్టి పెట్టి ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు డ్రైనేజీ కాలువల సమస్యను పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తం చేయండి

ప్రజాశక్తి - సి బెళగల్‌



వర్షాకాలంలో వచ్చే సీజనల్‌ వ్యాధులపై గ్రామాల్లో ప్రజారోగ్య దృష్ట్యా ప్రజలను అప్రమత్తం చేయాలనీ జిల్లా మలేరియా అధికారి నూకరాజు, ఎంపీడీఓ శకుంతల, ఈఓఆర్డీ సందీప్‌, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈ గోనెనాయక్‌ పేర్కొన్నారు. బుధవారం పరిషత్‌లో సర్పంచులు,ఆశా, వైద్య సిబ్బంది, తదితరులతో వారు సమీక్షించి మాట్లాడారు. దోమలు వృద్ధి చెందకుండా పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో చేపట్టాలన్నారు. అలాగే సీజనల్‌ వ్యాధులపై గ్రామాల్లో అవగాహన సదస్సులను ఏర్పాట్లు చేయాలనీ సురక్షతమైన నీటిని తప్పక అందించాలన్నారు.

ఘనంగా రాహుల్‌ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్‌

నగరంలోని కర్నూలు జిల్లా కాంగ్రెస్‌ కమిటీ కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్‌ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్‌ గాంధీ జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్‌ నాయకులు కార్యకర్తల సమక్షంలో డిసిసి అధ్యక్షుడు బాబు రావు కేక్‌ కట్‌ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్‌ బాబు, పిసిసి ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకష్ణ, డిసిసి గౌరవాధ్యక్షులు ఉండవల్లి వెంకటన్న, కర్నూల్‌ నగర కాంగ్రెస్‌ అధ్యక్షులు జాన్‌ విల్సన్‌, స్టాండింగ్‌ కమిటీ మాజీ చైర్మన్‌ పీజీ నరసింహులు యాదవ్‌, పిసిసి అధికార ప్రతినిధి బి రామాంజనేయులు, డిసిసి కోఆర్డినేషన్‌ కమిటీ చైర్మన్‌ అనంతరత్నం మాదిగ, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, డిసిసి పాల్గొన్నారు.



కర్నూలు డిసిసి కార్యాలయంలో కేక్‌ కట్‌ చేస్తున్న బాబురావు, తదితరులు



నంద్యాల చెక్‌పోస్టు దామోదరం సంజీవయ్య భవన్‌లో సంబరాలు

కర్నూలు హాస్పిటల్‌: ఆల్‌ ఇండియా కాంగ్రెస్‌ కమిటీ మాజీ అధ్యక్షులు ఎంపీ రాహుల్‌ గాంధీ 54వ జన్మదిన వేడుకలు నంద్యాల చెక్‌పోస్టు దామోదరం సంజీవయ్య భవనంలో ఘనంగా నిర్వహించారు. కేకు కట్‌ చేసి కార్యకర్తలకు కార్మికులతో కూడా జన్మదిన వేడుకలు నిర్వహించి అక్కడ ఉన్న కార్మికులకు స్వీట్లు పంపిణీ చేశారు.కాంగ్రెస్‌ నంద్యాల పార్లమెంట్‌ డీసీసీ అధ్యక్షులు జె.లక్ష్మీ నరసింహ యాదవ్‌ మాట్లాడుతూ ప్రస్తుతం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌ కూటమికి 240 సీట్లు రావడం హర్షనీయమన్నారు. రాబోయే కాలంలో కాంగ్రెస్‌ పార్టీ మరింత పుంజుకొని 300కు పైగా సీట్లు సాధించి రాహుల్‌ గాంధీ ప్రధానమంత్రి అవుతారని లక్ష్మీ నరసింహ యాదవ్‌ జోష్యం చెప్పారు. ఇండియా కూటమి ఒక 30 సీట్లు సాధించి ఉంటే ఈ రాష్ట్రానికి మొట్టమొదటి సంతకం ప్రత్యేక హోదాపైన రాయలసీమకు, ప్రత్యేక ప్యాకేజీ, రైతులకు రుణమాఫీ జరిగి ఉండేదని అన్నారు. కాంగ్రెస్‌ పార్టీ బలోపేతం చేయడం కోసం ఒక సైనికులాగా పార్టీ కోసం పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బాలస్వామి, కాంగ్రెస్‌ పార్టీ మైనార్టీ నాయకులు జాకీర్‌ హుస్సేన్‌, జిల్లా ఉపాధ్యక్షులు బోయ రమణ, యూత్‌ కాంగ్రెస్‌ నాయకులు ఆసిఫ్‌, ప్రసాద్‌ పాల్గొన్నారు.

రామోజీరావు సేవలు మరువలేనివి

- మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్‌

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్‌

మీడియా రంగంలో రామోజీరావు చేసిన సేవలు మరువలేనివని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్‌ అన్నారు. స్థానిక మౌర్య ఇన్‌ లోని ఆయన కార్యాలయంలో రామోజీరావు మృతికి సంతాపంగా ఘనంగా నివాళులు అర్పించారు. టీజీ వెంకటేష్‌ మాట్లాడుతూ 50 సంవత్సరాల క్రితం సైకిల్‌ మీద తిరిగే సామాన్య వ్యక్తి మీడియాలో ప్రవేశించి మీడియా రంగాన్ని కొత్త పుంతలు తొక్కించిన వ్యక్తిగా రామోజీరావు గుర్తింపు పొందారన్నారు. సామాన్య వ్యక్తి స్థాయి నుంచి ప్రపంచం మొత్తం గుర్తుంచుకునే వ్యక్తి స్థాయికి చేరుకోవడం వెనక ఆయన కష్టం ఎంతో ఉందన్నారు. పత్రిక ద్వారా విద్యార్థులకు, రైతులకు, కార్మికులకు, వ్యాపారులకు, పారిశ్రామిక వేత్తలకు ఎంతో విలువైన సమాచారంతో సలహాలు, సూచనలు ఇచ్చేవారనిఅన్నారు. అలాగే రాజకీయాల్లోకి వచ్చిన ప్రజా నాయకులకు ప్రజల అవసరాలను తెలియజేస్తూ ప్రజలకు సేవ చేసేందుకు అవసరమైన సూచనలు అందించడంలో ఎప్పుడూ ముందుండేవారని రామోజీ సేవలను టీజీ కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పరమేష్‌, పామన్న మాజీ కార్పొరేటర్లు గున్నా మార్క్‌, బాబు రాజ్‌ టీజీవి ట్రేడ్‌ యూనియన్‌ నాయకులు వాయు గండ్ల సుబ్బారావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



రామోజీరావుకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న టిజి.వెంకటేష్‌

అభ్యర్థులు తుది అకౌంట్స్‌ సమర్పించాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్‌

పార్ల మెంట్‌, అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి పోటీ చేసిన అభ్యర్థులు తుది అకౌంట్స్‌ సమర్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె మధుసూదన్‌ రావు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌ హాల్‌లో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి పోటీ చేసిన అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై పార్టీలు ప్రతినిధులతో, ఏఈఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో చివరి అడుగు ఉందని, ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి ఒక్క అభ్యర్థుల యొక్క వ్యయ ఖర్చుకు సంబంధించి తుది అకౌంట్స్‌ వ్యయ పరిశీలకులకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 28 వ తేదీన వ్యయ పరిశీలకులు వస్తారని, పార్లమెంట్‌, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన వారు అభ్యర్థుల అకౌంట్స్‌ పరిశీలిస్తారన్నారు. అందరు అభ్యర్థులు అకౌంట్స్‌ పరిశీలన పూర్తి చేసుకోని ఈనెల 25వ తారీకు లోపల సమర్పించవలసి ఉంటుందన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు.



పత్తికొండ ఆర్‌డిఒను సన్మానిస్తున్న అధికారులు

ఆర్డీఓకు ఘన సన్మానం

ప్రజాశక్తి - పత్తికొండ

పత్తికొండ ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి ఆర్డీఒ నీలపు రామలక్ష్మి సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా విజయవంతంగా నిర్వహించినందుకు పత్తికొండ రెవె న్యూ డివిజన్‌ ఎపిఆర్‌ఎస్‌ఎ ప్రెసిడెంట్‌ నాగరాజు, సెక్రటరీ మల్లికార్జున, ట్రెజరర్‌ భీమేష్‌, అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌ బాబు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌ సభ్యులు ఈరమ్మ, రాందాసు , వీరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఆవాజ్‌' ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్‌

కర్నూలు నగరంలోని చౌక్‌ బజార్‌ స్థానిక జిబి ఫంక్షన్‌ హాల్‌ నందు గురువారం సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు ఆవాజ్‌ నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్‌ హుస్సేన్‌, ఎస్‌ఎండి. షరీఫ్‌, మదీనా హిందీ డిగ్రీ కాలేజ్‌ కరస్పాండెంట్‌ మహమూద్‌ పాషాలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 సంవత్సరాల నుండి ఆవాజ్‌ కమిటీ ఆధ్వర్యంలో ఈ సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నామన్నారు. పేద ముస్లిం వధువు, వరులకు ఇది సువర్ణ అవకాశంగా స్వీకరించి ముందుకు వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఆర్థిక స్తోమతలేక సతమతమవుతున్న ముస్లిం మైనార్టీలకు ఇది ఎంతో ఉపయోగకరంగా, లాభదాయకంగా ఉంటుందని వారు తెలియజేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోనిలో కబ్జాలకు తావు లేదు

బెట్టింగు, గ్యాంబ్లింగ్ మట్కాకు పాల్పడితే చర్యలే

ప్రజాశక్తి - ఆదోని

భూ కబ్జాలు, మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్,దౌర్జన్యాలు, అక్రమాలు నాటు సారవిక్రయం, అక్రమ మద్యం అమ్మకాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి హెచ్చరించారు. బుధవారం ఆదోని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో జనసేన ఇన్చార్జి మల్లప్ప, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి గుడిసె ఆదికృష్ణమ్మతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. క్రికెట్ బెట్టింగ్ కారణంగా లక్షలాది రూపాయలు మోసపోయి ఆత్మహత్యలకు పాల్పడు తున్నారన్నారు. ఇటీవల పెసల బండ గ్రామంలో ఆత్మ హత్యకు పాల్పడ్డ విద్యార్థి ఈశ్వర్ కుటుంబాన్ని పరామర్శించి తల్లిదండ్రులను ఓదార్చమన్నారు. ఇప్పటి వరకు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారు ఇప్పటికైనా వదులుకోవాలన్నారు. అలాంటి వారి వివరాలను తమకు అందజేస్తే పోలీసులకు సమాచారం ఇచ్చి కేసులు నమోదు చేయిస్తామన్నారు. ఏ పార్టీ వారైనా అక్రమాలకు పాల్పడితే సహించ బోమన్నారు. ఆదోని నియోజక వర్గంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రజలు సహకరించాలన్నారు. ఆదోని ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రామ్‌జల చెరువులో నిల్వ ఉన్న నీటిని బయటకు మళ్లింపు చర్యలు మొదలయ్యాయని అన్నారు. అందులో విషంతో కూడుకున్న పదార్థాలు నిల్వ ఉన్నాయని, వ్యర్థాలు కారణంగా ఆ నీటిని తాగడానికి వీలుకాని పరిస్థితి ఉందని సైంటిఫిక్‌గా రిపోర్టు వచ్చిందన్నారు. నీటిని ఖాళీ చేసి నేలపై లేరును తీసి శుభ్రం చేయిస్తామన్నారు. వర్షపు నీళ్లను నిల్వ ఉంచి భవిష్యత్తులో పట్టణ ప్రజలకు తాగునీటికి వినియోగిస్తామని తెలిపారు. రామ్‌జల ఆధునికరణ కోసం నిధులు వచ్చాయని తెలిసిందని. అక్కడ జరిగిన అక్రమాలు గురించి త్వరలోనే ఆధారాలతో ప్రజలకు వివరిస్తానని తెలిపారు. ఆదోని నియోజకవర్గంలో హాస్టల్లో కొరత వేధిస్తుందన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించేందుకు త్వరలోనే అద్దెభవనాలు ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణంలో రోడ్లలో పడ్డ గుంతలను పూడ్చేందుకు సుమారు రూ.కోటి 50 లక్షలు ఖర్చు అవుతుందని, అధికారులు నివేదిక తయారు చేశారని నిధులు మంజూరు చేయించి పనులు జరగేలా చూస్తామన్నారు. ఆదోనిలో నెలకొన్న సమస్యలను ప్రజలు నేరుగా తమకు తెలపాలని విజ్ఞప్తి చేశారు.శ్రీనివాస్ ఆచారి, రాజశేఖర్, శ్రీనివాసులు ఉన్నారు.


మాట్లాడుతున్న వైసిపి నాయకులు

కార్యకర్తలు అధైర్య పడొద్దు

అండగా ఉంటాం : వైసిపి

ప్రజాశక్తి-పెద్దకడబూరు

మండలంలో వైసిపి కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దని అన్ని విధాలుగా అండగా ఉంటామని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పెద్దకడబూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.ఎన్నికల్లో టిడిపి ప్రభంజనం ఉన్నప్పటికీ నియోజకవర్గ ప్రజలు మరోసారి బాలనాగిరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటామన్నారు. గెలుపుకోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. టిడిపి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, రవి చంద్రారెడ్డి, ముక్కరన్న, దొడ్డిమేకల సర్పంచి చంద్రశేఖర్, పూజారి ఈరన్న, అర్లప్ప ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అద్వాన్న స్థితిలో అడ్డరోడ్లు

-గ్రామాల అడ్డరోడ్లన్నీ గుంతల పడి కంకర తేలిన వైనం
-గుంతలు పడిన అడ్డరోడ్లకు ఇరువైపులా ముళ్ల చెట్లు
-గుంతలు పడిన రోడ్లలో వెళ్లలేక అవస్థలు పడుతున్న వాహనదారులు
-అధికారులు పట్టించుకోని వైనం
-పలు గ్రామాల ప్రజలు ప్రభుత్వాలను అధికారులను శాపనార్థాలు పెడుతున్న పట్టించుకోని వైనం
- కొత్త ప్రభుత్వమైనా పట్టించుకొని మరమ్మతులు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి

ప్రజాశక్తి-చిప్పగిరి

మెయిన్ రహదారి నుంచి గ్రామాలలోకి వెళ్ళు అడ్డరోడ్లన్నీ కూడా గుంతల కంకర తేలి చాలా అద్వాన స్థితిలో ఉన్నాయని పలు గ్రామాల ప్రజలు వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. చిప్పగిరి మండలంలో చాలా గ్రామాలకు మెయిన్ రహదారి నుంచి గ్రామాలలోకి వెళ్లే రోడ్లు ఉన్నాయి. రామదుర్గం బస్సు స్టేజి నుంచి రామదుర్గం గ్రామంలోకి వెళ్ళు రహదారి, తిమ్మాపురం గ్రామానికి వెళ్లే అడ్డరోడ్డు, నేమకల్లు బస్‌స్టేజి నుంచి నేమకల్లు, సంఘాల గ్రామాలలోకి, కుందనగుర్తి అడ్డరోడ్డు ఇవన్నీ కూడా చాలా అధ్వాన స్థితిలో ఉన్నాయి. ప్రయాణాలు చేయాలంటేనే భయమేస్తుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వర్షాకాలంలో రాత్రి సమయంలో బస్సులు దిగి గ్రామాలలోకి నడిచి పోవాలంటే కూడా ఇబ్బందిగా ఉంది. దీనికి తోడు రోడ్లు ఇరువైపులా ముళ్ళ చెట్లు ఉన్న నేపథ్యంలో విష పాములు తిరుగుతుంటాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వర్షాలు పడుతున్న సందర్భంగా రైతులందరూ కూడా తమ పొలాలకు ఎరువులు కొని తెచ్చుకోవడానికి ఈ రోడ్ల పరిస్థితి చూసి వెనకడగేస్తున్నారు. చిప్పగిరి నుంచి ఏరూరు గ్రామానికి వెళ్లే 8 కిలోమీటర్ల రహదారి అంతా అడుగు అడుగున గుంతలు, కంకరతేలి ఉన్నాయి. ఈ అద్వాన్న రహదారి వలన రోజు ప్రయాణం చేసే డేగులపాడు, ఏరూరు గ్రామాలకు చెందిన విద్యార్థులు తమ గోడును ఎవరూ పట్టించుకోవడంలేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు ఏరూరు రహదారిని,గ్రామాలకు వెళ్లే ఆర్‌అండ్ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సంబంధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


గుంతలు పడిన నేమకల్లు అడ్డరోడ్డు

స్వీయ ధృవీకరణతో చర్మకారుల పింఛన్ మంజూరు చేయాలి

-చర్మకారులందరికీ వృత్తి కేంద్రాలు నిర్మించి, కిట్లు ఇవ్వాలి: ఎపిసివిఎస్

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

చర్మకారులు అందరికి స్వీయ ధ్రువీకరణ ఆధారంగానే పింఛన్ మంజూరు చేసి, వృత్తి కేంద్రాలను నిర్మించి ఇవ్వడంతోపాటు వత్తి కిట్లను వెంటనే ఇవ్వాలని ఎపిసివిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండి. ఆనంద్ బాబు, సుమాల అంథోని డిమాండ్ చేశారు. బుధవారం ఎమ్మిగనూరు పట్టణంలోని శివ సర్కిల్, ఎస్‌బిఐ ఏటిఎంపైనున్న కెవిపిఎస్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ చర్మకార వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.చక్రపాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోని సచివాలయ అధికారులు గత ప్రభుత్వం ఇచ్చిన సర్టిఫికెట్ ఉంటేనే క్లారిటీ లేనితికమక సర్కులర్‌తో ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఫించన్ అంటూ సర్కులర్ ఇచ్చి, సర్టిఫికెట్ ఇచ్చే వారు ఎవరు అనేది తేల్చకుండా, ఫించన్లు నమోదు చేయకుండా ఆపారన్నారు. షాపుంటేనే ఫించన్ అని మరో మెలిక పెట్టారన్నారు. జిల్లా కేంద్రంగా ఉన్న కర్నూలు, రాష్ట్ర కేంద్రంగా ఉన్న విజయవాడ అయినా చర్మకారుల వృత్తి కేంద్రాలు చినిగిన గొడుగు, పాత బ్యానర్ కింద, చెట్టు, గోడల పక్కన పెట్టుకుని కుట్టడమే తప్ప ప్రత్యేక వృత్తి కేంద్రాలు లేవని, ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలన్నారు. రూ.20 వేలు విలువ చేసే చర్మకారుల వృత్తి కిట్లను ఇస్తామని ఇచ్చిన సర్కులర్‌ను గత ప్రభుత్వం పెడ చెవిన పెట్టిందన్నారు. నూతన ప్రభుత్వం కలుగజేసుకుని వెంటనే ఇవ్వాలన్నారు. స్వీయ ధ్రువీకరణ ద్వారానే ఫించన్ నమోదు చేసుకోవడం తోపాటు, చర్మకారుల వృత్తి ఫించన్ రూ. 6000 కు పెంచి ఇవ్వాలన్నారు. అనేక సమస్యలతో కలగలిసి జీవిస్తున్న చర్మకారులకు ప్రత్యేక బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సమావేశం లో ఎపిసివిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సుమాలరాజు, రామకోటి హనుమంతు, గర్జిఅంజి, జిల్లా సహాయ కార్యదర్శులు గుంటెప్ప, ఆదామ్, నాగరాజు, రత్నంజిల్లా కమిటి సభ్యులు ప్రకాశం, రంగస్వామి, మద్దిలేటి, దేవదాసు, శాంతిరాజు, మోషన్న, తోటయ్య, మోహన్, దేవసహాయం, రాజు, ఏసన్న, పుల్లెలబాబు, దేవరాజు, రాజేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున ఎపి సివిఎస్ జిల్లా అధ్యక్షులు ఎండి ఆనంద్ బాబు

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఆదోని

దేశ ప్రజల గుండెల్లో స్థిరమైన స్థానాన్ని సంపాదించి, దేశాభివృద్ధికి అహర్నిశలు కషి చేస్తూ ముందుకు సాగుతున్న మన ప్రియతమ యువ నాయకులు, భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం ఆదోనిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఆదోని ఇంఛార్జి రమేష్ యాదవ్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ మార్కు తగ్గిందన్నారు. దక్షిణ భారతంలో రాహుల్ గాంధీ దేశ భవిష్యత్తు అని ప్రజలు నమ్మారన్నారు. రాబోయే రోజుల్లో రాహుల్ దేశ ప్రధాని అవ్వడం ఖాయమని అన్నారు. పట్టణంలో ఎటువంటి సమస్యలైనా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దిలీప్‌ఢోకా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతిరావు, పట్టణ అధ్యక్షులు సాయినాథ్, రామకృష్ణారెడ్డి , పట్టణ యువజన అధ్యక్షులు దేవిశెట్టి వీరేశ్, పెద్దహరివాణం వీరారెడ్డి, మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నిసార్ అహ్మద్, తాయన్న, జయన్న, బసవరాజు, ఎజాజ్ అహ్మద్, హుస్సేన్, రామన్నయాదవ్, నాగరాజు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు రమేష్ యాదవ్

వాలంటీర్ల విధులపై స్పష్టత లేదు

ఎంపిడిఒ మునెప్ప

ప్రజాశక్తి-మంత్రాలయం



వాలంటీర్ల విధుల నిర్వహణపై ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టమైన ఆదేశాలు లేవని ఆదోని ఎంపిడిఒ జి.మునెప్ప తెలిపారు. బుధవారం ఆదోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ప్రజాశక్తితో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో వాలంటరీ వ్యవస్థ కీలకమైన నేపథ్యంలో ప్రస్తుతం టిడిపి ప్రభుత్వంలో వాలంటిరీ వ్యవస్థను అనుసరిస్తుందా లేదో తెలియదు అన్నారు. మండలంలో మొత్తం 20 గ్రామాలకు 278 మంది వాలంటీర్లను ప్రభుత్వం నియమించిందన్నారు. వారి ద్వారా లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేసిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. ఇంటింటికీ సేవలు అందించిన వాలంటీర్లు ఎన్నికల సందర్భంగా వైసిపి ప్రభుత్వానికి మద్దతు ప్రకటించేందుకు 156 మంది వాలంటీర్లు తమ రాజీనామాలు సమర్పించారని పేర్కొన్నారు. మిగిలిన 122 మంది వాలంటీర్లు విధుల్లో ఉన్నట్లు తెలిపారు.


వేలం పాట నిర్వహిస్తున్న ఇఒపిఆర్‌డి ఈశ్వరయ్య స్వామి

వేలంలో నందవరం మేజర్ పంచాయతీకి పెరిగిన ఆదాయం

ప్రజాశక్తి-నందవరం

నందవరం మేజర్ గ్రామ పంచాయతీ వేలంపాటలో ఈ ఏడాది పంచాయతీ ఆదాయం పెరిగింది. బుధవారం సర్పంచి తోట సావిత్రి , ఉప సర్పంచి జె.శివారెడ్డి గౌడ్ అధ్వర్యంలో మూడు రకాల వేలాలు వేశారు. ఈ వెలాలను మండల ఇఒపిఆర్‌డి ఈశ్వరయ్య స్వామి, ఎంపిడిఒ కిరణ్ మోహన్ రావులు నిర్వహించారు. బండ్ల మెట్ట లేదా దినసరిమార్కెట్ రూ.1,75,500, వారపు సంత మార్కెట్ రూ.50,500, కమేల రూ.8100 అంటే మొత్తం రూ.2,33,600 వేలంపాటను పాటదారుడు శవాల భాస్కర్ తండ్రి చెన్నప్ప దక్కించుకున్నారు. గత సంవత్సరం వేలంపాట కంటే ఈసారి పంచాయతీకి రూ. 1,53,100 అధికముగా ఆదాయం వచ్చిందన్నారు. పంచాయతీ ధరల నిబంధన ప్రకారం డబ్బులు వసూలు చేయాలని, అధికంగా వసూలు చేస్తే పాటను క్యాన్సల్ చేసి వేరే వ్యక్తులకు ఇస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎన్.రామారావు, ప్రసాద్, శ్రీనివాస రావు, పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్పంచి అయ్యమ్మ ,పంచాయితీ కార్యదర్శి తిరుమలేశ్వర్‌రెడ్డి

21న మేజర్ పంచాయతీల వేలాలు

తిరుమలేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి-కోసిగి

కోసిగి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో వివిధ మార్కెట్ సంబంధించిన వేలాలను ఈనెల 21 తేదీన శుక్రవారం ఉదయం 10:30 గంటలకు వేలాలు నిర్వహిస్తున్నట్లు మేజర్‌గ్రామ పంచాయితీసర్పంచి ఎస్.అయ్యమ్మ తెలిపింది. బుధవారం కోసిగి గ్రామపంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సర్పంచి ,పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వర్ రెడ్డి మాట్లాడారు. వేలాల్లో పాల్గొనే వారు గ్రామపంచాయతీ నోటిఫికేషన్‌లోని షరతులకు ,నిబంధనలకు లోబడి పాటలో పాల్గొనాలని తెలిపారు. ఈ వేలం పాటలు వారపు సంత మార్కెట్, బండిమెట్ట ,చిన్నకమేల ,పెద్ద కమేల లకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాడవలసినవారు బండి మేట్టకు రూ.50వేలు వారపు సంతకు రూ.50వేలు, చిన్న కమేలకు రూ.5 వేలు, మిగతా అన్నింటికి రూ5 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

హరిద్వార్‌లో శ్రీ మఠం ప్రారంభం

ప్రజాశక్తి-మంత్రాలయం

ఉత్తర భారత దేశంలో గల హరిద్వార్‌లో శ్రీరాఘవేంద్రస్వామి మఠాన్ని శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు, సోదె వాదిరాజ, మఠం పీఠాధిపతులు శ్రీ విశ్వవల్లభ తీర్లులు ఇరువురు కలిసి పండితుల వేద మంత్రాల మధ్య ప్రారంభించారు. నంజనగూడ శ్రీ రాఘవేంద్రస్వామి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ రాఘవేంద్రస్వామి మఠాన్ని భక్తుల సౌకర్యార్థం శ్రీ మఠం నిధులతో నిర్మించగా ఇద్దరు పీఠాధిపతులు విమాన సర్వీసు ద్వారా హరిద్వార్ చేరుకున్నారు. వారు శ్రీ మఠం చేరుకొని జ్యోతి ప్రజ్వలనతో శిలాఫలకం ప్రారంభించారు. అంతకు ముందు అక్కడ నిర్మించిన శ్రీ మఠంలో వివిధ హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు శ్రీ విశ్వవల్లభ తీర్థలకు శాలువతో పూల మాలలు వేసి పళ్లు సమర్పించి గౌరవించగా ఆయన కూడా శ్రీ మఠం పీఠాధిపతులకు అదే విధంగా గౌరవించారు.



హరిద్వార్‌లో శ్రీ మఠం భవనానికి ఏర్పాడు చేసిన శిలాపలకాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం


హరిద్వార్‌లో శ్రీ రాఘవేంద్రసామి మఠానికి సంబంధించిన భవనం

ప్రమాదాలను నివారించాలి: డివైఎఫ్ఐ


ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరం నడిబొడ్డున సుందరయ్య జంక్షన్‌లో సర్కిల్ ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కర్నూలు కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. డివైఎఫ్ఐ న్యూసిటీ కార్యదర్శి హుస్సేన్ బాష మాట్లాడుతూ సుందరయ్య జంక్షన్ రోజురోజుకు ప్రమాదాలకు నిలయంగా మారిందని అన్నారు. నగరంలో విపరీతంగా పెరుగుతున్న ట్రాఫిక్ , బస్టాండు, మార్కెట్ యార్డు దగ్గరగ ఉండటంవల్ల ,వెంకటరమణ కాలనీ నుండి బస్టాండ్ కు వెళ్ళే వాహనాలు, బంగారు పేట నుండి వెంకటరమణ కాలనీకి వెళ్లే వాహనాలు సుందరయ్య జంక్షన్ కు వచ్చేసరికి క్రాసింగ్‌లో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. చాలామంది వాహన ప్రజలు ఈ జంక్షన్‌లో రాంగ్ రూట్ లో వెళుతుండటంతో ఇక్కడ ఎటువంటి సర్కిల్ లేకపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయనఅనరు. అధికారులు తక్షణమే స్పందించి జంక్షన్‌లో సర్కిల్ ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరారు డివైఎఫ్ఐ నగర నాయకులు వీరేష్, పి.గౌతం, మహేష్ పాల్గొన్నారు.


అడిషనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న డివైఎఫ్ఐ నాయకులు హుస్సేన్

వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ధ్వంసం

ప్రజాశక్తి -పత్తికొండ

పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో బుధవారం మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈ ఘటనపై వైసిపి నాయకుడు బనగాని శ్రీనివాసులు విగ్రహంపై దాడి చేసిన వారిపై కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుండగులను గుర్తించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు స్పందించక పోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.




డ్రైవరకు రూ.3వేల చెక్కును అందజేస్తున్న ఆదోని డిఎం అహ్మద్ రఫి

ఆదర్శ ఉద్యోగులకు అభినందన

ప్రజాశక్తి- ఆదోని

ఆదోని ఆర్‌టిసి డిపోలో బుధవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. వివిధ రంగాల్లో ఉత్తమ పనితీరు కనబరచిన డ్రైవర్లు, కండక్టర్లకు డిపోమేనేజర్ అహ్మద్ రఫీ ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేసి సన్మానించారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ ప్రయాణికులకు ఉత్తమ సేవలందిస్తేనే సంస్థ అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ఆర్‌టిసి అభివృద్ధిలో డ్రైవర్లు, కండక్టర్ల పాత్ర కీలకమన్నారు. డిపో ఆదాయం పెంపునకు కషి చేసిన వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఏప్రెల్ నెలలో ఉత్తమ కెఎంపిఎల్ సాధించిన డ్రైవర్లు రంగన్న, గోవిందు, దౌలా, అత్యధిక ఆదాయం అర్జించిన కండక్టర్లు పోతన్న, పంపన్న, వీరేశప్ప, వెంకటేశులు, ఉత్తమ మెకానిక్‌లు షరీఫ్, సుధాకర్, కోచ్ బిల్డర్ బ్రహ్మయ్యలను మేనేజర్ అభినందించారు.


అధికారికి సమస్యలను వివరిస్తున్న టిడిపి నాయకులు

గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి- దేవనకొండ

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మండల స్థాయి అధికారులతో మండల టిడిపి కన్వీనర్ విజయభాస్కర్ కోడా ఆధ్వర్యంలో టిడిపి నాయకులు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఇద్రుస్ బాష, ఎపిఒ కృష్ణమూర్తి, ఎపిఎం రమేష్ లతో మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రధానంగా త్రాగునీటి, డ్రెయినేజీ, సిసి రోడ్ల సమస్యలు ఉన్నాయని వీటిపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉచ్చీరప్ప, మలకన్న మాజీ ఎంపిటిసి ఆకుల వీరేశు, రామారావు నాయుడు, మల్లయ్య, వెంకటస్వామి గౌడ్ పాల్గొన్నారు.